క్లుప్తంగా

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కృషి

మాడుగులపల్లి: నూతనంగా ఏర్పడిన మాడ్గులపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల భవనాల నిర్మాణానికి స్థలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. 20 రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి త్వరగా పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, వెంకన్న, నరేష్, యాదగిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలోని పాల్వాయి, జూనూతుల, చేపూరు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మల్లేపల్లి నుంచి గుర్రంపోడుకు గల 33 కేవీ విద్యుత్‌లైన్ల కింద చెట్లను తొలగిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ముస్లింలకు రేవంత్‌రెడ్డి సర్కార్ మొండి చేయి

మిర్యాలగూడ : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మంత్రివర్గంలో ముస్లింలకు స్థానం కల్పించకుండా మొండి చెయ్యి ఇచ్చిందని మిర్యాలగూడ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎండీ.ఇలియాస్ అన్నారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ముస్లిం ఎమ్మెల్యే కాని, ఎమ్మెల్సీని కాని మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్న ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డికి కరువైందన్నారు. ఎన్నికల సమయంలో మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. వెంటనే ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లీం మైనార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

దేవరకొండ : అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ నేపథ్యంలో సోమవారం ఆయనను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ముట్టడి చేస్తారన్న కారణంతో ముందస్తు అరెస్టు చేయడం తగదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు తేల్చే దాక పోరాటం ఆగదని తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ టూ టౌన్ అధ్యక్షుడు పెద్దబోయిన వెంకటరమణ అన్నారు. సోమవారం పట్టంలోని హౌసింగ్‌బోర్డు కార్యాలయంలో టూ టౌన్ ఆధ్వర్యంలో పార్టీ వర్క్‌షాపును రాష్ట్ర పార్టీ నేత సాధినేని శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ నేత సజ్జల నాగిరెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శివశంకర్, కొండేటి శేఖర్, నిరంజన్‌రెడ్డి, హరిప్రసాద్, రేణుక, లక్ష్మారెడ్డి, యాదగిరి, సత్యనారాయణ, నరేష్, పాండురంగా తదితరులున్నారు.

హాలియా దడవాయి యూనియన్ కమిటీ ఎన్నిక

హాలియా : హాలియా వ్యవసాయ మార్కెట్ దడవాయి యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల దడవాయి యూనియన్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దడవాయి యూనియన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా హాలియా వ్యవసాయ మార్కెట్ దడవాయి యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దడవాయి యూనియన్ అధ్యక్షుడిగా రావులపాటి వెంకన్న, సెక్రటరీగా అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చెన్నం రమేష్‌ను ఎన్నుకుని శాలువాతో ఘనంగా సన్మానించారు.

పూడికతీత పనులు చేపట్టాలి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రెండు ప్రధాన నాలాల్లో పూడికతీత పనులు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సీతారాంపురంలోని ప్రధాన నాలాను పరిశీలించి అక్కడే నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాపురం, ముత్తిరెడ్డికుంట మురుగు కాలువల్లో పూడికతీత పనులకు గాను నాలుగు విభాగాలలో రూ.60లక్షలు వకు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రవినాయక్, పాండు, పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- తిరుమలగిరిలో కేజీబీవీ, పెద్దవూరలో పీహెచ్‌సీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి



తిరుమలగిరి : కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి



పెద్దవూర : ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రజా పాలనలో భాగంగా తమ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.3.35 కోట్లతో నూతనంగా నిర్మించిన కేజీబీవీ బాలికల విద్యాలయ భవనాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అల్వాల ఎక్స్ రోడ్డు నుంచి ముకుందాపురం వరకు హైబ్రీడ్ యామినిటీ రోడ్డును త్వరలోనే ప్రారంభించి పనులు చేపడతామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసి గత ప్రభుత్వంలోని పెద్దలను ఒప్పించి మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు అంగోతు భగవాన్ నాయక్, చవ్వా బ్రహ్మనందరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యభాష్యానాయక్, మండల అధ్యక్షుడు కృష్ణ నాయక్, నాయకులు గడ్డం సాగర్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్, ఎంపీడీఓ మల్లిక్వర్, ఎంఈఓ శ్రీనివాస్, ఎస్ఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో సొడమ్మ జాతర సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో కలిసి కొద్దిసేపు డోలు బేరీలు వాయించి యువతను ఉత్తేజపర్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

పెద్దవూర : రాజకీయం కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే చేసుకోవాలని, ఆ తర్వాత రాజకీయాలకు అతీతంగా అందరూ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ సహకరించాలని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ. 1.56 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో సకల సౌకర్యాలతో నిర్మించి పీహెచ్‌సీ భవనాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తాను జానారెడ్డి స్కూల్ నుంచే వచ్చినప్పటికీ జానారెడ్డిది ప్రభుత్వ పాఠశాల వైఖరి అని, కాని నాది ప్రైవేట్ పాఠశాల వైఖరి అని అన్నారు. సబ్జెక్టు ఒకటే అయినా మ్యాటర్ వేరేలా ఉంటదని పేర్కొన్నారు. ఎన్నికలు అయిపోగానే గెలిచినా, ఓడినా అభివృద్ధి సంక్షేమం వైపు వెళ్లాలని, అలా ఆలోచించిన వారికే తరువాత ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, డీహెచ్ఎంఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీహెచ్ఎంఓ కేస రవి, మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, పీఆర్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, ఈఈ రఘుపతి, వైద్యాధికారి డాక్టర్ నగేష్, మండల పార్టీ అధ్యక్షుడు పబ్బు యాదగిరి, పాల్గొన్నారు.

అందరం ఆరోగ్యంగానే ఉన్నాం



బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే

పెద్దవూర: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవానికి సోమవారం సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డిలు హాజరయ్యారు. ప్రారంభించిన తర్వాత మెడికల్ ఆఫీసర్ గదిలోకి వెళ్లిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డిలు డాక్టర్‌చే బీపీ చెక్ చేయించుకున్నారు. బీపీ చెక్ చేయించుకున్న ముగ్గురుకి నార్మల్‌గానే ఉన్నట్లు వైద్యాధికారి డాక్టర్ నగేష్ వారికి చెప్పారు. దీంతో అందరం ఆరోగ్యంగానే ఉన్నమన్న మాట అంటూ చమత్కరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ఎంఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీహెచ్ఎంఓ కేస రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని కాపాడుకుందాం



మిర్యాలగూడ : ఈదులగూడలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డిలు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కరపత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు భగవాన్ నాయక్, బ్రహ్మనందరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అంగోతు సూర్యభాష్యానాయక్, మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, నాయకులు సాగర్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్, ఎంపీడీఓ మల్లిక్వర్, ఎంఈఓ శ్రీనివాస్, ఎస్ఓ కవిత పాల్గొన్నారు.

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో అందించే విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం ధర్మానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఈదులగూడలో బడిబాట కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను అందిస్తుందని, విద్యార్థులకు లైబ్రరీ, ఉచిత నోట్‌బుక్స్‌లు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం వంటివి అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు.సీ కార్యక్రమంలో కొర్ర కృష్ణకాంత్ నాయక్, ముంతాజ్ బేగం, తావుర్యా, అనిత, జ్యోతి, ధనలక్ష్మీ, అశ్విని, స్పందన, కాంతయ్య, స్వామి, భవాని, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రం పంపిణీ

పట్టణంలోని బంగారుగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, జనమైత్రి వ్యవస్థాపకులు, సామాజిక వేత్త ఎండీ మునీర్ అహ్మద్ షరీఫ్‌లతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు ఉన్నాయని, ఈ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరనారాయణ, ఎండి ఫెరోజ్, ఎల్లమ్మ, రజనీ, సైదిరెడ్డి తదితరులున్నారు.

పెండ్లిపాకలలో బడిబాట

కొండమల్లేపల్లి : మండలంలోని పెండ్లిపాకల గ్రామంలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బృందం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్టబోయిన శ్రీనివాస్, నజీరుద్దీన్, యాదగిరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కొండమల్లేపల్లి : భూ భారతి చట్టం అమలులో భాగంగా కొండమల్లేపల్లి మండల పరిధిలోని అచ్చంపేట పట్టి, పేర్వాల, కొల్‌ముంతలపహాడ్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో మొత్తం 26దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మందా సైదులురావు గౌతమ్

హాలియా : మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో మందా రామయ్య, బిక్షమమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మందా సైదులురావు గౌతమ్, సత్యనారాయణ, రంజిత్‌రావుల సహకారంతో సోమవారం గ్రామంలోని దివ్యాంగులు, నిరుపేదలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్ మాట్లాడుతూ ఏ పని చేసుకోలేని నిస్సాయులకు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేసి సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి యడవెల్లి సోమశంకర్, మందా జయంత్ రామ్, యడవెల్లి దుర్గమ్మ, మణితేజ్, కొండా సతీష్, యడవెల్లి రమేష్, దేవిక, సోమమ్మ, మూడావత్ రమేష్, కంచనపల్లి రవీంద్ర, మేగావత్ శంకర్, విజయ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

కొండమల్లేపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణకు నల్లగొండ జిల్లా ఎస్పీ ఆదేశానుసారం డీటీఆర్‌బీ బృందం ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని సాగర్ రోడ్డులోని పెండ్లిపాకల ఎక్స్ రోడ్డు వద్ద అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ అజ్మీర రమేష్ పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీఆర్‌బీ ఇన్‌చార్జ్ హెచ్‌సీ రాజు, డీటీఆర్‌బీ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక

దేవరకొండ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని సోమవారం దేవరకొండలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి వెంకట్ మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిగా జీవ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కొండ్రపల్లి నగేష్, దేవరకొండ మండల అధ్యక్షుడిగా సాలయ్య, చందంపేట అధ్యక్షుడిగా వెంకటయ్య, కొండమల్లేపల్లి అధ్యక్షుడిగా శ్రీకాంత్‌లను నియమించినట్లు తెలిపారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని చింతలపాలెం గ్రామంలో నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో ఎంఎన్‌జే ప్రభుత్వ ప్రాంతీయ క్యాన్సర్ వైద్యశాల సహకారంతో ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 85 మందికి రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాట్కో ట్రస్టు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళీధర్, ఎంఎన్‌జే ఆస్పత్రి క్యాంపు కో-ఆర్డినేటర్ సర్వేశ్వర్‌రావు, వైద్యులు స్వాతి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాల్వల గట్ల ఆక్రమణలపై పోలీసులకు ఫిర్యాదు

గుర్రంపోడు : మండలంలోని తెరాటిగూడెం, మొసంగి గ్రామాల్లో చెరువులకు వెళ్లే ఫీడర్ ఛానళ్ల గట్లను ఆక్రమించుకునేందుకు మట్టిని తొలగిస్తున్న వారిపై పోలీసులకు నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ఫిర్యాదు చేశారు. తెరాటిగూడెంలో కొత్తచెరువు నుంచి చేపలు పట్టేందుకు కట్టను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులు పోలీసులను కోరారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

దేవరకొండ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ప్రభుత్వం విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్ల ఉపకార వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



బొకమంతలపహాడ్ లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త లింగయ్య

నిడమనూరు : సాగులో ఆధునిక పద్ధతులు వాడి, వ్యవసాయాన్ని లాభదాయకంగా చేసుకోవాలని కంపాసాగర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎస్ లింగయ్య సూచించారు. మండలంలోని బొకమంతలపహాడ్‌లో సోమవారం 'రైతు ముంగిట్లో –శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. సదస్సులో శాస్త్రవేత్త లింగయ్య, డాక్టర్ వి శ్రీధర్ మాట్లాడుతూ సాగు వ్యయం తగ్గించుకొనేలా అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. రసాయన పురుగుమందులు, ఎరువుల వాడకం తగ్గించుకోవాలని కోరారు. నాణ్యమైన విత్తనం కోసం ప్రభుత్వరంగ సంస్థల వైపు రైతులు మొగ్గు చూపలన్నారు. వ్యవసాయాధికారి ఎం మునికృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎం అనిల్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ పిల్లి రమేష్, అభ్యుదయ రైతులు ఆవుల జానయ్య, వెంకన్న, సీహెచ్ మల్లారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు



పలుగుతండాలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గు పోస్తున్న కాంగ్రెస్ నాయకులు

త్రిపురారం : ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇందిమ్మ ఇల్లు అందుతాయని త్రిపురారం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద దేవుల పల్లి, పానుగోతు తండా, త్రిపురారం, బెజ్జికల్, కంపాసాగర్, పలుగుతండా, బాబుసాయి పేట గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోసి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దనావత్ భాస్కర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి కుమార్, అంబటి రాము, గుండెబోయిన నగేష్ యాదవ్ పలువులు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు కొమిరె స్వామి మాదిగ

హాలియా : ఎమ్మార్పీస్ భవిష్యత్ అంతా అసమానతలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుదామని మహాజన్ సోషలిస్టు పార్టీ(ఎంఎస్పీ) రాష్ట్ర నాయకులు, సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమిరె స్వామి మాదిగ పిలుపునిచ్చారు. హాలియా పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యంగా మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఏర్పడిన ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా మాదిగ జాతి యావత్తును చైతన్యం చేసి సమాజ మద్దతు కూడగట్టి అవిశ్రాంతంగా రాజీలేని పోరాటాలు చేసి విజయాన్ని సాధించిందని గుర్తు చేశారు. మంద కృష్ణ మాదిగ మొక్కవోని ఆత్మస్థైర్యం పటిష్ట నాయకత్వం వల్లే సాధ్యపడిందన్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ గ్రామాన అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా సమన్వయకర్త జానకి రామయ్య చౌదరి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గార్లపాటి ప్రసాద్, తరి ఏడుకొండలు మాదిగ, దున్న ఈదయ్య మాదిగ, మేడి సైదులు మాదిగ, కేతపల్లి కల్యాణ్ మాదిగ, రేపాక నరసింహ, గిరి, మడుపు శ్రీకాంత్, మడుపు విజయ్ తదితరులు ఉన్నారు.

శివాజీ మహరాజ్ చరిత్ర అందరూ తెలుసుకోవాలి



హిందూ సామ్రాజ్య దినత్సోవంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

మిర్యాలగూడ టౌన్ : శివాజీ మహరాజ్ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ బంటు జనార్దన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఆర్ ద్రోణా స్కూల్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంపర్క్ ప్రముఖ్ గూడూరు శ్రీనివాస్‌రావు, జిల్లా సహ వ్యవస్థ ప్రముఖ్ చెరుపల్లి కరుణాకర్, నగర కార్యనిర్వహాక్ అంకెనపల్లి సుధాకర్, తిప్పన వెంకటేశ్వర్లు, కిరణ్‌రాజు, సరికొండ ప్రీతం రాజు,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, చల్లమళ్ల సీతారాంరెడ్డి, సజ్జల నాగిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు తదితరులున్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏఓ సరిత

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ఎరువులు, మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారిని గుర్రం సరిత తనిఖీలను నిర్వహించారు. అనంతరం స్టాక్‌లను పరిశీలించడంతో పాటు రికార్డులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎరువుల దుకాణాల్లో పత్తి, వరి విత్తనాలతో పాటు యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు. ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల్లో తీసుకున్న శాంపిల్స్ విత్తనాలను విత్తన పరీక్ష కేంద్రానికి టెస్టింగ్‌కు పంపించినట్లు తెలిపారు. అదే విధంగా లైసెన్స్‌లు కలిగిన డీలర్ల వద్దను కొనుగోలు చేయాలన్నారు. ఆమె వెంట వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

బీటీ రోడ్డు నిర్మించరూ..

- ఏళ్ల తరబడి నల్లచెలమూల గ్రామస్తుల నిరీక్షణ
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు



నల్లచెలమూల గ్రామానికి వెళ్లే రోడ్డు పరిస్థితి

చందంపేట : చందంపేట మండల కేంద్రం నుంచి సుమారు 28 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లచెలమూల గ్రామస్తులు గ్రామం నుంచి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగర్ ముంపు నిర్వాసితులుగా నల్లచెలమూల గ్రామంలో నిర్వాసితులుగా ఇక్కడ గ్రామస్తులు పునరావాసం కల్పించారు. అయితే గ్రామం నుంచి వేరే గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డుమార్గం లేకపోవడంతో నల్లచెలమూల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.1.60కోట్లు నిధులు మంజూరు

చిత్రియాల నుంచి కంబలపల్లికి వెళ్లే రోడ్డు నుంచి నల్లచెలమూల గ్రామానికి గత ప్రభుత్వ హయాంలో రూ.1.60 కోట్ల వ్యయంతో గతంలో బీటీ రోడ్డు నిర్మాణం మంజూరు అయ్యింది. ఆ రోడ్డు మంజూరై రెండేళ్లు గడుస్తున్నప్పటికీ రోడ్డు నిర్మాణపనులు మాత్రం చేపట్టడం లేదు. దీంతో రోడ్డు నిర్మాణంలో ఆలస్యం జరుగుతుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం లేదు



సుమారు 70 ఏళ్లుగా మాకు ఊరు నుండి రోడ్డు సదుపాయం లేదు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్న మోక్షం కలగలేదు. కాని గత ప్రభుత్వ హయాంలో రూ.1.60కోట్లతో రోడ్డు మంజూరైంది కాని రోడ్డు పనులు మాత్రం ఇంత వరకు చేస్తలేరు. కనీసం ఊరిలో అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. రోడ్డు సరిగా లేదని అంబులెన్స్ తిరిగి వెనక్కి వెళ్లిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో అత్యవసర సమయాల్లో వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– పొలగోని సత్యనారాయణగౌడ్, నల్లచెలమూల

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్(పీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎస్పీ క్యాంపులో గల మహాత్మా జ్యోతిరావ్‌పూలే బీసీ భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య సంవత్సరం ప్రారంభం అవుతున్నందున ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలని కోరారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు పుట్టగోడుగుళ్ల పుట్టుకొస్తున్నాయని ఆరోపించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో వివిధ రకాలు, పాఠ్య పుస్తకాలతో దోపిడీని పూర్తిగా అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో పీఎస్‌యూ జిల్లా కన్వీనర్ మచ్చ వంశీ, కో కన్వీనర్ నల్లగంతుల అజయ్, రవి, శంకర్, బి. మహేందర్‌రెడ్డి, నల్లగంతుల మనోజ్, మల్ల అజయ్, అరుణ్ తదితరులున్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

పెద్దవూర : దళిత రత్న అవార్డు గ్రహీత ముదిగొండ వెంకటేశ్వర్లును సోమవారం మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. భవిష్యత్‌లో మరెన్నో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త శ్రీను, దళితసంఘం నాయకులులు రామదాసు, సత్యనారాయణ, రామకృష్ణ, వెంకటేష్, ఆదిమళ్ల రాములు పాల్గొన్నారు.

సీపీఐ మండల కమిటీ ఎన్నిక

చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)చింతపల్లి మండల నూతన కమిటీని సోమవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి గా పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి వుజ్జిని అంజల్ రావు, కార్యవర్గ సభ్యులు కోలుకులపల్లి కొండలు, పల్లపు లక్ష్మయ్య, శేఖరచారి, బుచ్చయ్య, శంషుద్దీన్, కూడిదుటి వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అటెండర్లను తొలగించాలని వినతి

మిర్యాలగూడ : జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులాల్లో కనీసం విద్యార్హతలు లేకుండా హైదరాబాద్‌లోని వీఎల్ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా అక్రమంగా నియామకమైన ల్యాబ్ అటెండర్లను, అటెండర్లను వెంటనే తొలగించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. సోమవారం నల్లగొండలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్గం సతీష్‌కుమార్, విజయకుమార్, నవీన్, రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.